గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● డీపీఓ సురేశ్

మర్రికుంటలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ సురేశ్

గరిడేపల్లి, మార్చి 19 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ అన్నారు. మండలంలోని మర్రికుంట గ్రామంలో పారిశుధ్య పనులు, నర్సరీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే మోడల్ కోడ్ కండక్ట్‌కు సంబంధించిన విషయాలను సైతం పరిశీలించారు. తదుపరి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి ఇంటి పన్ను వసూలు, డీఎస్ఆర్ తదితర అంశాలపై సమీక్ష చేశారు. తాగునీటి సరఫరాపై శ్రద్ధ వహిస్తూ రోజు వారి ఆర్థిక కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వనజ, ఎంపీఓ మౌలానా పాల్గొన్నారు.

గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

● ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా మహదేవ్

మీలా మహదేవ్‌ను సన్మానించి అభినందిస్తున్న గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సభ్యులు

బొడ్రాయిబజార్, మార్చి 19 : సమాజ హితం కోసం గ్రీన్ క్లబ్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ముఖ్య సలహాదారు జె.శశిధర్ సలహా మేరకు పర్యావరణ పరిరక్షణకు సుధాకర్ పీవీసీ సహకారంతో విద్యార్థుల భాగస్వామ్యం కోసం మన పర్యావరణం– మన బాధ్యత అంశంపై రాష్ట్ర స్థాయిలో వివిధ పాఠశాలల్లో వ్యాస రచన పోటీలు నిర్వహించగా విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇందు కోసం రూ.లక్ష అందజేసిన మీలా మహదేవ్‌ను మంగళవారం స్థానిక గ్రీన్ క్లబ్ ట్రస్ట్ కార్యాలయంలో అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ అధ్యక్షుడు ముప్పారపు నరేందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, కోశాధికారి ఉప్పల శ్రావణ్, ఈసీ మెంబర్స్ ముప్పారపు నాగేశ్వర్‌రావు, వనమాల వెంకటేశ్వర్లు, గెల్లి అంజన్ ప్రసాద్ పాల్గొన్నారు.

సూర్యాపేటలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

సంతోష్‌బాబు చౌరస్తాలో బారికేడ్స్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేట సిటీ, మార్చి 19 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్, సంతోష్‌బాబు చౌరస్తాతో పాటు జాతీయ రహదారి 65 సర్వీస్ రోడ్‌పై, రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలోని మినీ అండర్ పాస్ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ప్రత్యేక చర్యలు చేపట్టారు. పాత బస్టాండ్, సంతోష్‌బాబు చౌరస్తాలో రాంగ్‌రూట్ ప్రయాణాన్ని నివారించేందుకు బారికేడ్స్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా మినీ అండర్‌పాస్‌లో బైక్‌లు మాత్రమే వెళ్లేలా స్టాపర్స్‌ను ఏర్పాటు చేశారు. పాత బస్టాండ్, సంతోష్‌బాబు చౌరస్తాలో రాంగ్ రూట్ ప్రయాణాలను నివారించేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్స్‌ను డీఎస్పీ రవి, పట్టణ సీఐ రాజశేఖర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజలు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తూ సక్రమంగా ప్రయాణం చేసి పనులు చక్కబెట్టుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న కోదండరామ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైర్‌పర్సన్ ప్రమీల దంపతులు

కోదాడ, మార్చి 19 : కోదాడ పట్టణంలో పునర్నిర్మితమైన కోదండరామ స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాల్గోవ రోజు మంగళవారం యాగశాల వద్ద వేద పండితులు తెల్లవారుజాము నుంచే విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఆంజనేయ స్వామికి విశేష అభిషేకం, మన్య సూక్త హవనం, నిత్య కార్యక్రమాలను కనుల పండువగా జరిపించారు. మున్సిపల్ వైర్‌పర్సన్ సామినేని ప్రమీల రమేశ్ దంపతులతో పాటు పట్టణ ప్రముఖులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీరాముల వారు చెన్నకేశవ స్వామి అవతారంలో పంచాయుధాలు ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం బుధవారం ప్రతిష్ఠంచబోయే దేవతల విగ్రహాలను దేవాలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

కోదాడ టౌన్/కోదాడ రూరల్, మార్చి 19 : మారుతున్న జీవన విధానం నేపథ్యంలో విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరికీ ఆహారపు అలవాట్లపై అవగాహన ఉండాలని స్థానిక మాస్టర్ మైండ్ పాఠశాల కరస్పాండెంట్ పొట్ట కిరణ్ అన్నారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి వాటిలోని పోషకాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

మఠంపల్లి, మార్చి 19 : మండలంలోని యాతవాకిళ్ల గ్రామంలో ఎస్కే సలీంకు చెందిన ఐదు ఎకరాల గడ్డివాము మంగళవారం దగ్ధమైంది. బాధితుడు సలీం తెలిపిన వివరాల ప్రకారం.. ఐదు ఎకరాల గడ్డి ప్రమాదవశాత్తు మంటల్లో పూర్తిగా కాలిపోయిందని సుమారు రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

చిన్నారులకు పలకలు అందజేత

గరిడేపల్లి, మార్చి 19 : మండలంలోని పొనుగోడు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం-6లోని చిన్నారులకు గ్రామానికి చెందిన మిడిసినమెట్ల బలరాం, ప్రియాంక దంపతులు వారి కుమారుడు విహాన్ పుట్టిన రోజు సందర్భంగా పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పి.నాగమణి, ఆయా ధనమ్మ, పలువురు బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌కు ముగిసిన నామినేషన్ల స్వీకరణ

హుజూర్‌నగర్, మార్చి 19 : ఈ నెల 26న హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్‌కు జరుగనున్న ఎన్నికలకు నామినేషన్ల ప్రకియ ముగిసినట్లు ప్రధాన ఎన్నికల అధికారి రాఘవరావు, సహాయ కార్యదర్శి అంజయ్య మంగళవారం విలేకరులకు తెలిపారు. మొత్తం 11 పోస్టులకు ఎన్నికలు జరుగుతుండగా 21 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు.

మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

బొడ్రాయిబజార్ : మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బొడ్రాయిబజార్, మార్చి 19 : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే, దివంగత మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం కీలక భూమిక పోషించిందన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం తుపాకీ చేతబట్టి దొరలు, భూస్వాములు, దేశముఖ్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేసినట్లు తెలిపారు. సారా వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొని మద్యపానం బంద్ అయ్యే వరకు పోరాటం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లాపల్లి నర్సింహారావు, వేల్పుల వెంకన్న, ధనియాకుల శ్రీకాంత్, వీరబోయిన రవి, ఎల్గూరి గోవింద్, చినపంగ నర్సయ్య, వల్లపుదాసు సాయికుమార్, మామిడి సుందరయ్య, బొమ్మిడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : మల్లు స్వరాజ్యం స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మేదరమెట్ల వెంకటేశ్వరావు, పట్టణ కార్యదర్శి ఎం.ముత్యాలు ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొండయ్య, శ్రీనివాస్, వెంకన్న, వీరబాబు, యేసోబు, సత్తిరెడ్డి శరభందరెడ్డి, రహీం పాల్గొన్నారు.

నేరేడుచర్ల : పట్టణంలోని స్థానిక అరిబండి భవన్‌లో నిర్వహించిన మల్లు స్వరాజ్యం వర్ధంతి కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొదమగుండ్ల నగేశ్, కందగట్ల అనంత ప్రకాశ్, సిరికొండ శ్రీను, నీలా రాంమూర్తి, కుంకు తిరపతయ్య, పాతూరి శ్రీనివాస్‌రావు, తాడోజు శ్రీను, అమరారపు భరత్ పాల్గొన్నారు.

మేళ్లచెర్వు : ప్రజా సమస్యల పరిష్కారానికి మల్లు స్వరాజ్యం చేసిన కృషి మరువలేనిదని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు అన్నారు. స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, సైదా, సామేలు, జబ్బార్, రాంబాబు, రాములు పాల్గొన్నారు.

నాగారం : మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దేవరకొండ యాదగిరి అన్నారు. మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో స్వరాజ్యం ద్వితీయ వర్ధంతిని నిర్వహించి మాడ్లాడారు. కార్యక్రమంలో వెంకటమ్మ, సృజన, మాణిక్యం, సుజాత, ప్రమీల, కవిత పాల్గొన్నారు.

అర్వపల్లి : మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతిని ఎంసీపీఐయూ, సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొలిశెట్టి యాదయ్యరావు, మండల కార్యదర్శి శ్రీను, ఎంసీపీఐయూ తుంగతుర్తి డివిజన్ ఇన్‌చార్జి ఈదురు వీర పాపయ్య పాల్గొన్నారు.

అనుమతులు పొందిన వెంచర్‌లోనే ప్లాట్లు కొనుగోలు చేయాలి

● తాసీల్దార్ ఆంజనేయులు

మునగాల, మార్చి 19 : మండల కేంద్రంలో ప్లాట్లు కొనుగోలు చేయదలచిన వారు అనుమతులు పొందిన వెంచర్ నందు మాత్రమే ప్లాట్లు కొనుగోలు చేయాలని తాసీల్దార్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం తాసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో కొన్నేండ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయాల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ప్లాట్లను విక్రయించినట్లు ఫిర్యాదులు అందాయన్నారు. మునగాలలో సర్వే నంబర్ 247, 256, 403, 435, 494, 496, 518, 514, 515, 550 అనుమతులు లేవని చాలామంది ఫిర్యాదు చేయగా విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లినట్లు చెప్పారు. లే అవుట్‌లను పరిశీలించి నివేదిక పంపాలని గ్రామ పంచాయతీలకు ఆదేశాలు అందగా అవన్నీ అక్రమ లేఅవుట్లని తేలింది. కావునా అటువంటి వాటిలో క్రయ విక్రయాలు జరుగకుండా సబ్ రిజిస్ట్రార్ కోదాడ వారికి రిజిస్ట్రేషన్లు ఆపేందుకు లేఖ రాసినట్లు వెల్లడించారు. వారి ఆదేశాను సారం అట్టి సర్వే నంబర్ల నందు రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని మునగాల ప్రత్యేక అధికారిగా సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ ద్వారా తెలిపినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆర్ ఐలు రాధారెడ్డి, సంజీవరావు, రామారావు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలి

● ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డేవిడ్‌కుమార్

ఎండిన పొలాల్లో నిరసన తెలుపుతున్న నాయకులు

ఆత్మకూర్.ఎస్, మార్చి 19 : కాంగ్రెస్ చెప్పిన విధంగా రైతులకు తక్షణమే రూ.2 లక్షల రుణమాఫీ చేసి పంట నష్టం ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని, యాసంగి నుంచి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలోని ఖాసిగూడెంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు. ఎస్సారెస్పీ నీరు చివరి ఆయకట్టు వరకు అందించని మూలంగా పలు మండలాల్లోని అనేక గ్రామాల్లో వరి పంట ఎండిపోయి రైతులు మరింత నష్టానికి గురి కావాల్సి వచ్చిందన్నారు. అధికారుల పర్యవేక్షణ లేని మూలంగా ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు వాడుకోవడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని, ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. కావునా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పరిశీలన చేసి పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. అలాగే ఈ యాసంగి నుంచి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇఫ్ట్యూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎస్‌కే.మైబెల్లి, పొరెళ్ల దశరథ, అరుణోదయ డివిజన్ కార్యదర్శి ఎర్ర ఉమేశ్ పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలి

● పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి

గరిడేపల్లి, మార్చి 19 : మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా యువత పోరాటాలు చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి అన్నారు. మండలంలోని వెలిదండ గ్రామంలో మంగళవారం సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉద్యోగ, ఉపాధి, వైద్య అవకాశాలు సక్రమంగా లేకపోవడంతో యువత పెడదారి పట్టే పరిస్థితి నెలకొన్నట్లు చెప్పారు. దేశ పునర్నిర్మాణంలో యువతే పెద్ద పాత్ర అని కానీ నేటి పాలకులు మాత్రం వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. కావునా రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి కామ్రేడ్ల ఉదయ్, డివిజన్ నాయకుడు నరేశ్, పీడీఎస్‌యూ నాయకులు విక్రమ్, శ్రీను, మహేశ్, వేణు, సాత్విక్, ఐఎఫ్‌టీయూ నాయకులు మూశెట్టి అంజయ్య, సాంబయ్య, అరుణోదయ నాయకుడు నగేశ్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : మతోన్మాదానికి బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మలోతు చందర్ రావు అన్నారు. హుజూర్‌నగర్‌లోని ఐఎఫ్‌టీయూ శ్రామిక భవన్‌లో భగత్‌సింగ్ వర్ధంతి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.రాజేశ్, అనిల్, సంతోష్, రామకృష్ణ, వివేక్, నాగరాజు, శివకుమార్, మణిదీప్ పాల్గొన్నారు.

ఆకతాయిలకు పోలీసుల కౌన్సిలింగ్

సూర్యాపేట సిటీ, మార్చి 19 : ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్, ఎంజీ రోడ్‌లో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాష్‌గా బైక్ నడుపుతున్న, ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలను 18 మందిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రద్దీ ప్రాంతాలు, విద్యా సంస్థల మార్గంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆకతాయిలను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

నూతనకల్, మార్చి 19 : ప్రతి మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. మంగళవారం 18 మంది మహిళల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేయగా అనుమానం ఉన్న ఏడుగురికి చెందిన రక్త శ్యాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తారమ్మ, వెంకట్‌రెడ్డి, ఆనంద్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

కోదాడ నియోజకవర్గ గ్రామీణ రోడ్లకు మహర్దశ

● 52.17 కోట్లతో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం

కోదాడ, మార్చి 19 : కోదాడ నియోజకవర్గంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనున్నది. రూ.52.17 కోట్లతో నియోజకవర్గ వ్యాప్తంగా పలు రహదారులు, బ్రిడ్జీలు నిర్మించనున్నారు.. ఈ మేరకు రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధుల మంజూరుకు ఉత్తర్వులు జారీ అయినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 43 పనులకు గాను నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. ఎమ్మార్ గ్రాంట్లు రూ.22 కోట్ల 50 లక్షల 80 వేలతో 15 బీటీ రోడ్ల పునర్నిర్మాణం, సీఆర్ఆర్ గ్రాంట్లు రూ.22కోట్ల 76లక్షల 90వేలతో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 20 కొత్త బీటీ రోడ్లు, రూ.10కోట్ల 90 లక్షలతో 8 బ్రిడ్జీలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పదో తరగతి విద్యార్థికి గాయాలు

గరిడేపల్లి, మార్చి 19 : రోడ్డు ప్రమాదంలో పదో తరగతి విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గరిడేపల్లి సమీపంలో రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన రాం జయంత్ అనే విద్యార్థి అదే గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పరీక్షా కేంద్రంలో వార్షిక పరీక్షలు రాస్తున్నాడు. మంగళవారం జరిగిన హిందీ పరీక్ష రాసి తోటి విద్యార్థితో కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గరిడేపల్లి, పొనుగోడు గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న నేరేడుచర్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన వ్యాన్, వీరు ప్రయాణిస్తున్న బైక్ ఒక దానినొకటి ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో బైక్ వెనుకాల కూర్చున్న జయంత్ రోడ్డుపై పడగా తలకు తీవ్ర గాయమైంది. వెంటనే చికిత్స కోసం 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

ఆర్థిక సాయం

నూతనకల్, మార్చి 19 : నూతనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన శ్రీరామ ఉప్పులయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు స్నేహితుడి కటుంబానికి మంగళవారం రూ.13 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఇరుగు బుచ్చిమల్లు, నెల్లుట్ల కృష్ణ, కోడి రవి, దీకోండ వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, రమేశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఫణిగిరి సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

నాగారం, మార్చి 19 : రాష్ట్రంలో రెండో భద్రాద్రిగా వెలుగొందుతున్న ఫణిగిరి సీతారామచంద్రస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నట్లు ఆలయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్ (నర్సింహారావు) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 31 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నట్లు వెల్లడించారు. స్వామి వారి కల్యాణంలో కూర్చోదలచిన వారు రూ.516ను ఆలయ ఈఓ, అర్చకుడికి చెల్లించి రశీదు పొందాలని పేర్కొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్

చింతలపాలెం, మార్చి 19 : అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, తాసీల్దార్ సురేందర్‌రెడ్డి సీజ్ చేశారు. మండల పరిధిలోని వెల్లటూరు గ్రామ రెవెన్యూ శివారులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి ఫారెస్ట్ భూములకు తరలిస్తున్నారనే సమాచారంతో రైడ్ చేసి టిప్పర్లను పట్టుకున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదిరెడ్డి, రేంజ్ ఆఫీసర్స్ లక్ష్మీపతిరావు, గౌతమ్, సెక్షన్ ఆఫీసర్ ప్రేమ జ్యోతి, ఫారెస్ట్ సిబ్బంది ప్రదీప్, శ్రీనివాస్, వినోద్, అనిల్, వెంకన్న పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి : ఎస్పీ రాహుల్ హెగ్డే

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, మార్చి 19 : పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలని, ఈ మేరకు కోర్టు సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలీసు అధికారుల నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు భద్రత విషయంలో నిత్యం తనిఖీలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ కఠినంగా నిర్వహించాలన్నారు. మద్యం మత్తులో, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే జరిమానాతో పాటు వాహనాలు సైతం సీజ్ చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రధాన పట్టణ కేంద్రాల్లో ట్రాఫిక్ నియంత్రణ రెగ్యులేషన్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సంబంధిత అధికారులతో సమన్వయంగా పని చేస్తూ నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓపెన్ డ్రింకింగ్, అక్రమ రవాణా, గంజాయి అమ్మకం, వినియోగాన్ని నివారించడం కోసం అనుక్షణం కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సూర్యాపేట సబ్ డివిజన్ డీఎస్పీ రవి, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య, సీఐలు రాజశేఖర్, సురేందర్‌రెడ్డి, శ్రీను, రఘువీర్‌రెడ్డి, డీసీఆర్‌బీ, ఐటీ కోర్ ఎస్ఐలు పాల్గొన్నారు.

తనిఖీలు పటిష్టంగా చేయాలి

ఎన్నికల నియమావళి ప్రకారం తనిఖీలు పటిష్టంగా చేపట్టాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సిబ్బందిని ఆదేశించారు. జాతీయ రహదారి 65పై జనగామ క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీని ఎస్పీ పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ బాలునాయక్ ఉన్నారు.

నేడు హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేశ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి

నేరేడుచర్ల, మార్చి 19 : హుజూర్‌నగర్ పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరుపుతున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు సమయానికి హాజరు కావాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చందమళ్ల జయబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, నాయకులు సుదర్శన్, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

పాలకవీడు : బుధవారం హుజూర్‌నగర్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి భూక్యా రవినాయక్ ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని గ్రామాల శాఖ అధ్యక్షులు, అనుబంధ శాఖల అధ్యక్షులు, నాయకులు, క